# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 18 అక్టోబర్ 2024 | HYDERABAD




## బల్దియా కమిషనర్‌గా ఇలంబర్తి బాధ్యతలు

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, అడిషనల్ కమిషనర్లు నళినీ పద్మావతి, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సీసీపీ శ్రీనివాస్, సీపీఆర్వో మహమ్మద్ ముర్తుజా అలీ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, రవికిరణ్, వెంకన్న, ఓఎస్డీ వేణుగోపాల్, ఆయా విభాగాల సీనియర్ అధికారులు కమిషనర్ ఇలంబర్తిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## మా ఇండ్లు మాకేనని..
పోస్టు కార్డులతో ఉద్యమం

'మూసీ సుందరీకరణ వద్దు.. మా ఇల్లు మాకే కావాలి' అని నినాదాలు చేస్తూ మూసీ పరీవాహక ప్రాంత వాసులు గురువారం రాత్రి నిరసన తెలిపారు. ఈ మేరకు తమ ఇండ్లను కాపాడాలని కోరుతూ.. రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి పోస్టు కార్డులు రాసి పంపించారు. -ఎల్బీనగర్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)

# బిగ్ బ్రదర్స్ పేరిట నయా దందా!


హద్దులు దాటిన అవినీతి

**మాదాపూర్** కావూరి హిల్స్ ఫేజ్- 2 రోడ్డులో దాదాపు 1000 గజాల స్థలం.. ఇందులో ఓ వ్యాపారి జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా సెకండ్ హ్యాండ్ కార్ సేల్స్ వ్యాపారానికి సిద్ధమై ఇందుకు సంబంధించి భారీ షెడ్డు నిర్మాణం చేపట్టాడు. అక్రమ నిర్మాణమని తెలుసుకుని స్థానిక శేరిలింగంపల్లి సర్కిల్‌కు చెందిన చైన్‌మెన్ (ప్లానింగ్ విభాగం ఉద్యోగి) ఆ స్థలం వద్దకు ఈ నెల 14న చేరుకున్నాడు. ఈ నిర్మాణం అక్రమం.. కూల్చేస్తానంటూ తన వెంట తెచ్చుకున్న జేసీబీతో హల్‌చల్ చేశాడు. అడిగినంత ఇస్తే ఒకే.. లేదంటే చుక్కలు చూపిస్తానంటూ నిర్మాణదారుడిని బెదిరించాడు. 'నిర్మాణం జోలికి రావొద్దంటే రూ. 30 లక్షలు ఇవ్వాలి.. ఏసీపీ నుంచి సీపీ, జెడ్సీ వరకు మీ జోలికి రారు.. నాకు 'బిగ్ బ్రదర్స్' అండదండలు ఉన్నాయి' అంటూ సదరు నిర్మాణదారుడికి హుకుం జారీ చేశాడు. ఈ క్రమంలో నిర్మాణదారుడితో రూ. 10 లక్షల బేరం కుదరడంతో ఇప్పటి వరకు అటు వైపు జేసీబీలు వెళ్లలేదు. ఇక్కడ విశేషమేమిటంటే సదరు చైన్‌మెన్ వెనుక బిగ్ బ్రదర్స్ ఉన్నారా? లేక తానే చెప్పుకుని దందాలకు తెరలేపాడా? చైన్‌మెన్ నుంచి ఏసీపీ, సీపీ, జెడ్సీలకు వాటాలు వెళ్తున్నాయా? అన్నది తేలాల్సి ఉంది. ఇదే సర్కిల్‌లో మరో చైన్‌మెన్ రాయదుర్గంలో 90 గజాల స్థలంలో చేపడుతున్న ఓ యజమాని నుంచి అదనపు ఫ్లోర్ ఉందంటూ రూ. లక్షకు పైగా ముక్కుపిండి వసూలు చేశాడు. ఇలా ఒక్క శేరిలింగంపల్లిలోనే కాదు జీహెచ్ఎంసీ ప్లానింగ్ విభాగంలో అవినీతి హద్దులు దాటుతున్నది. కొందరు అధికారులు, సిబ్బంది బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నారు. వివాదాస్పద భూములు, న్యాయస్థానాల్లో ఉన్న వాటికి కూడా 'డోంట్ కేర్' అంటున్నారు. డబ్బులు ముడితే అవినీతి దందాలో తగ్గేదేలే అంటున్నారు. కాసులు కొట్టు-అక్రమం సక్రమం చేసుకో అన్నట్లు దందా నడుస్తున్నది. -సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)



మాదాపూర్ కావూరి హిల్స్ ఫేజ్- 2 రోడ్డులో నిర్మాణంలో ఉన్న భారీ షెడ్డు

- అక్రమమా.. అన్నను కలువు..
- శేరిలింగంపల్లి సర్కిల్ కేంద్రంగా వసూళ్లు
- ఓ వ్యాపారస్తుడి నుంచి రూ. 30 లక్షల డిమాండ్
- రూ.10 లక్షల బేరం కుదరడంతో వెనక్కి వెళ్లిన బుల్డోజరు
- అడిగినంత ఇస్తే ఒకే.. లేదంటే నిర్మాణదారులకు చుక్కలే




### ఇస్తే ఒకే.. లేదంటే చుక్కలే

శేరిలింగంపల్లి సర్కిల్‌లో సదరు చైన్‌మెన్ గీసిన'లక్ష్మణ'రేఖ ఫైనల్...లేదంటే ఈ చైన్‌మెన్ బెదిరింపులకు నిర్మాణదారులు అయ్యో 'నారాయణ' అనాల్సిందే.గతంలో కూకట్‌పల్లిలో డీసీ వద్ద అటెండర్‌గా పనిచేసిన సదరు చైన్‌మెన్ అడ్డదారిలో డిప్యుటేషన్‌పై టౌన్‌ప్లానింగ్ విభాగంలోకి వచ్చాడు. గడిచిన పదేండ్లకు పైబడి శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్‌లో చైన్‌మెన్‌గా చెలామణి అవుతున్నాడు. ఇటీవల కాలంలో ఈ సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ ముఖ్య అధికారులు ఎవ్వరూ లేకపోవడంతో ఒక్కడే అన్నీ తానై రెచ్చిపోయాడు. రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరీ నగర్, అంజయ్య నగర్, సిద్ధిఖ్‌నగర్‌లో ఈ చైన్‌మెన్‌కు భారీగానే బాధితులు ముడుపులు సమర్పించుకున్న వారే.

### నిఘా ఏదీ?

అక్రమాలు అరికట్టేందుకు ఆన్‌లైన్ విధానం (టీజీ బీపాస్) అమల్లోకి తెచ్చినా టౌన్‌ప్లానింగ్ అధికారుల అమ్యామ్యాలు మాత్రం ఆగడం లేదు. అర్జీ పెట్టుకోవడమే ఆలస్యం..అడిగినంత ఇవ్వాల్సిందేనని ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ముడుపులు ముట్టచెబితే చాలు..నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. అంతేకాకుండా అక్రమ నిర్మాణాల ఏరివేత పేరిట నోటీసులు జారీ చేస్తూ ముడుపులు అందుకున్న నిర్మాణాల జోలికి వెళ్లడం లేదు. కొందరు ఏసీపీలు స్వతహాగా ప్రైవేట్ వ్యక్తులను ఏర్పరచుకుని అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల నిఘా లేకపోవడంతో ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందన్న విమర్శలు లేకపోలేదు. ఏసీపీల మాదిరిగానే ఏండ్ల తరబడి పాతుకుపోయిన చైన్‌మెన్లు, టీపీఎస్‌ల సమూల ప్రక్షాళన చేయాలన్న డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి. కాగా, శేరిలింగంపల్లి సర్కిల్ చైన్‌మెన్‌ల దందాలపై స్థానిక ఏసీపీ వెంకట రమణను 'నమస్తే తెలంగాణ ప్రతినిధి ఫోన్‌లో వివరణ కోరే ప్రయత్నం చేయగా...ఆయన స్పందించలేదు.



గాయాన్ని చూపుతున్న సందీప్‌రెడ్డి

అధికార పార్టీ నాయకులు, పోలీసులు మిలాఖత్ అయ్యారు. డబ్బున్న వారిని టార్గెట్ చేసి మామూళ్ల కోసం పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి విచక్షణ రహితంగా కొట్టి దారిలోకి తెచ్చే ప్రయత్నం చేసిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించింది. ఏసీపీ, సీఐలతో పాటు ఠాణా సిబ్బంది ముగ్గురు అన్నదమ్ములపై దాడి చేసి.. పోలీస్ వ్యవస్థ పరువును బజారుకీడ్చారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో విచారణకు ఆదేశించారు.

- సిటీబ్యూరో/ఉస్మానియా యూనివర్సిటీ

# పొలిటికల్.. పోలీస్ మిలాఖత్!

## గేమింగ్ జోన్ నిర్వహిస్తున్న అన్నదమ్ములపై జులుం

- అడిగినంత ఇవ్వకపోవడంతో పోలీసులను రంగంలోకి దింపిన అధికార పార్టీ నేత
- సోదరులను విచక్షణారహితంగా కొట్టిన పోలీసులు
- ఘటనపై ఉన్నతాధికారుల సీరియస్

**తార్నాకలో** నివాసముండే సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శివరాంరెడ్డి సోదరులు. తార్నాకలో తమకు ఉన్న స్థలంలో స్పోర్ట్స్ స్క్వేర్ గేమింగ్ జోన్ నిర్వహిస్తున్నారు. దాని పక్కనే మరికొంత స్థలం వీళ్లకు ఉంది. ఈ క్రమంలో వీరికి గేమింగ్ జోన్‌తో మంచి ఆదాయం వస్తున్నదని, తనను కూడా చూసుకోవాలంటూ అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ భర్త మామూళ్లకు కక్కుర్తి పడ్డాడు. తాము ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం లేదని నిజాయితీగా సంపాదించుకుంటున్నామంటూ చెప్పారు. అధికార పార్టీకి చెందిన తనకు అన్నదమ్ములు లొంగడం లేదని, సదరు నాయకుడు పోలీసులను రంగంలోకి దింపాడు. ఈ క్రమంలో గురువారం గేమింగ్ జోన్ వద్ద ఉన్న సందీప్‌రెడ్డిని పెట్రోలింగ్ పోలీసులు కలిశారు. 'మా సార్ పిలుస్తున్నాడు.. నీవు వెంటనే మాతో రావాలం'టూ హుకుం జారీ చేశారు. తన భార్య కారులో ఉందని, ఆమె గర్భవతి అని ఆమెను ఇంటి వద్ద దించి, తానే పోలీస్‌స్టేషన్‌కు వస్తానంటూ ఆయన పోలీసులను కోరాడు. 'తమషాలు చేస్తున్నావా..! మా సార్ పిలిస్తే రావా? ' అంటూ పెట్రోలింగ్ పోలీసులు సీరియస్ అయ్యారు. 'సార్ నేను నా భార్యను ఇంటి వద్ద దింపేసి వెంటనే వస్తానం'టూ ప్రాధేయపడ్డాడు. 'లేదు... మేం నీతోనే వస్తామం'టూ సందీప్‌రెడ్డి కారు వెంట పెట్రోలింగ్ వాహనం వెళ్లింది. ఇంటి వద్దకు వెళ్లగానే సందీప్‌రెడ్డి తన భార్యను దింపేశాడు. తరువాత తన కారులో వస్తానంటే.. 'లేదు.. మా కారులో కూర్చోమం'టూ పెట్రోలింగ్ వాహనంలో అతడితో పాటు అతడి సోదరులు సంతోష్‌రెడ్డి, శివారాంరెడ్డిని కూడా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు.

### సార్..మమ్మల్ని ఎందుకు పిలిపించారు?

ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ వద్దకు సోదరులు వెళ్లారు. 'సార్ మమ్మల్ని ఎందుకు పిలిపించారు.. మాపై ఏదైనా ఫిర్యాదు ఉందా? కేసులు ఏమైనా ఉన్నాయా?' అంటూ అడిగారు. 'ఏమి రా..! మేం పోలీస్‌స్టేషన్‌కు పిలిస్తే మీరు రారా..! ఏమనుకుంటున్నార్రా..! మీరు పెద్ద తోపులనుకుంటున్నారా? కూర్చోండం'టూ పరుష పదజాలాన్ని ఉపయోగించారు. 'ఇదేం అన్యాయం సార్' అనగానే 'నన్నే మీరు ప్రశ్నిస్తరా.. అంటూ బూతు పురాణం అందుకున్నాడు. సందీప్‌రెడ్డి గల్లా పట్టుకొని... పోలీసులంటే ఏమనుకుంటున్నావంటూ చేయి చేసుకున్నాడు.అక్కడున్న సిబ్బంది సైతం ఆ ముగ్గురు అన్నదమ్ములను పై అంతస్తులోకి లాక్కొని వెళ్లి చితకబాదారు. విషయం తెలుసుకున్న ఏసీపీ అక్కడకు చేరుకొని ఏమనుకుంటున్నారా..! మీకు చాలా ఎక్కువైంది.. నా కొడుకుల్లారా' అంటూ ఆయన కూడా తన సిబ్బందికే సపోర్టు చేస్తూ మాట్లాడడని బాధితులు ఆరోపించారు. బాధితుల మామ శ్రీనివాస్ రెడ్డి స్టేషన్‌కు చేరుకొని పోలీసుల అన్యాయాన్ని ప్రశ్నించాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లాడు. అదనపు డీసీపీ నర్సయ్య రంగంలోకి దిగారు. అయితే అప్పటికే ఈ విషయం బయటకు పొక్కడంతో తమపైనే సందీప్‌రెడ్డి దాడికి యత్నించాడంటూ పోలీసులు విషయాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అదనపు డీసీపీ బాధితులతో మాట్లాడి ఏదో జరిగింది... విషయం వదిలేయండంటూ వాళ్లతో మాట్లాడే ప్రయత్నం చేశారు.

### బాధితుల ముందే ఫోన్ చేసి..

ఇన్‌స్పెక్టర్‌కు బాధితుల ముందే అదనపు డీసీపీ ఫోన్ చేసి, బాధితులపై ఎవరూ ఫిర్యాదు చేశారు.. ఎందుకు వాళ్లను తీసుకొచ్చారంటూ ప్రశ్నించారు. సార్.. ఫలాన సార్ ఫోన్‌లో గేమింగ్ జోన్ వద్ద న్యూసెన్స్ అవుతుందంటూ మౌఖికంగా ఫిర్యాదు చేశారని, అందుకే వాళ్లను స్టేషన్‌కు పిలిపించామంటూ చెప్పాడు. దీంతో బాధితులను అదనపు డీసీపీ కూల్ చేసే ప్రయత్నం చేశారు. ఓయు ఠాణాలో ఎలాంటి ఘటన జరుగలేదంటూ ..సమస్య బయటకు రాకుండా తన వంతు ప్రయత్నం చేశారు. సీపీ ఈ ఘటనపై దర్యాప్తు జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారని బాధితులు వెల్లడించారు. శుక్రవారం సీఎం, డీజీపీలకు ఫిర్యాదులు చేస్తామని, అన్యాయంగా తమపై దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. 15 మంది పోలీసులు రక్తం కారేలా.. తమపై విచక్షణ రహితంగా దాడి చేశారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



## సలీం బస చేసిన మెట్రో పోలీస్ సీజ్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 17: సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం ధ్వంసం కేసులో.. ప్రధాన నిందితుడు సలీం బస చేసిన రెజిమెంటల్‌బజార్‌లోని మెట్రో పోలీస్ హోటల్‌ను గురువారం రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేశారు. అంతకుముందు సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రజని, గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసులు అధికారులు, సిబ్బంది హోటల్‌లో ఉన్న పలువురిని ఖాళీ చేయించి బయటకు పంపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మెట్రో పోలీస్ హోటల్‌లో పలువురు యువతకు ఇంగ్లిష్ వ్యక్తిత్వ వికాస శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ పేరుతో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే విధంగా శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో హోటల్‌ను సీజ్ చేసినట్లు సికింద్రాబాద్ తహసీల్దార్ తెలిపారు. నెల రోజుల నుంచి పోలీసు శాఖ నుంచి అనుమతులు లేకుండా సమావేశాలు జరిపారని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5 అంతస్తుల భవనంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. మోటివేషనల్ స్పీకర్ మునావర్ జమాతో పాటు హోటల్ యజమాని, మేనేజర్లపై కేసు నమోదు చేసినట్లు గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ వెల్లడించారు.

# హత్యలు.. మిస్టరీ!

## ఛేదించలేక.. చేతులెత్తేసి..

- కేసుల్లో పురోగతి శూన్యం
- సీసీ కెమెరాలుంటేనే ముందడుగు
- దర్యాప్తు నైపుణ్యాన్ని మర్చిపోతున్న రాచకొండ పోలీసులు
- టెక్నాలజీ సపోర్టు లేకుంటే తడబాటే..



సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతాల్లో వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకొని హత్యలు జరుగుతున్నాయి. వీటిని ఛేదించడంలో రాచకొండ పోలీసులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ఈ కేసులు మిస్టరీగా మారుతున్నాయి. దర్యాప్తు నైపుణ్యాలను పోలీసులు మర్చిపోయారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. టెక్నాలజీ సపోర్టుతో ఈజీగా కేసులను ఛేదిస్తున్న పోలీసులకు సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ దొరకలేదనే సాకుతో కొన్ని కేసులను పక్కన పెట్టేస్తున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఔటర్ రింగు రోడ్డు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఈ హత్యల మిస్టరీని ఛేదించడంలో పోలీసులు వైఫల్యం చెందుతున్నారు. కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి తరువాత వృద్ధ దంపతులను గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చారు. అయితే ఈ హత్యల వెనుక కారణాలేమిటీ? హంతకులెవరూ..? అనే విషయంలో పోలీసులు రెండు రోజులువుతున్నా చిన్న ఆధారాన్నీ సేకరించలేకపోయారు. వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకొని తరచూ హత్యలు జరుగుతున్నా, అందుకు గల కారణాలను మాత్రం పోలీసులు గుర్తించలేకపోతున్నారు.

### గతంలో పటిష్ఠంగా పెట్రోలింగ్ వ్యవస్థ

ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పోలీస్ యంత్రాంగం నిద్రావస్థలోకి వెళ్లిపోయింది. దీంతో క్షేత్ర స్థాయిలో పోలీసులు పని పక్కన పడేసి, సివిల్ వివాదాల పరిష్కారంపైనే ఎక్కువ ఫోకస్ పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నాయకులు చెప్పిన విధంగా పనిచేస్తూ అసలు కేసులపై దృష్టి సారించలేకపోతున్నారనే అపవాదును మూటగట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే మిస్టరీ కేసుల సంఖ్య పెరుగుతున్నదనే ఆరోపణలు వస్తున్నాయి.

### పురోగతి లేని కేసులు

- కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వృద్ధ దంపతులను హతమార్చారు. శివారులో ఇలాంటి ఘటనలు జరుగుతుండటంతో సైకో పనిగాను పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులకు సంబంధించిన ఒక్క ఆధారం కూడా చిక్కకపోవడంతో దర్యాప్తు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.
- ఈ ఏడాది జనవరిలో ఓ వ్యక్తిని హత్య చేసి, చేతులు, కాళ్లు కట్టేసి..గోనె సంచిలో మృతదేహాన్ని చుట్టి ఔటర్ రింగు రోడ్డు పై మూటను హంతకులు పడేసి వెళ్లారు. దీనిపై ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. కానీ మృతుడు ఎవరో? ఎలా హత్యకు గురయ్యాడో? హంతకులు ఎవరూ.. అనే విషయాలు నేటికీ తేలలేదు. ఈ కేసు దర్యాప్తు ఆటకెక్కింది.
- జనవరిలోనే ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళ్‌పల్లి గ్రామ సమీపంలో వ్యవసాయ భూమిలో కుళ్లిన స్థితిలో ఓ మహిళ మృతదేహం బయటపడింది. ఈ కేసులోనూ ఎలాంటి పురోగతి లేదు.
- గతేడాది కందుకూరు ఠాణా పరిధిలో ఫామ్ హౌస్‌లోనూ ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ కేసులోనూ నిందితులెవరో పోలీసులు తెలుసుకోలేకపోయారు.




## న్యాయం కోసం..

జీవో 29ను తక్షణమే రద్దు చేసి, గ్రూప్ -1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలంటూ.. అభ్యర్థులు గురువారం గాంధీనగర్ పార్క్‌లో నిరసన తెలిపారు.

# సాయం ఉత్తమాటే!

## మూసీ బాధితులకు అందని రూ.25వేలు

**రెక్కాడితే గానీ** డొక్కాడని బతుకులు వారివి. రెక్కల కష్టాన్ని నమ్ముకునే జీవులు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో కాయకష్టం చేసుకొని నిర్మించుకున్న ఇండ్లను రేవంత్ సర్కార్ భూస్థాపితం చేసింది. అలా ఇండ్లు కోల్పోయి డబుల్ బెడ్రూంల్లోకి బలవంతంగా వచ్చిన కుటుంబాలు 262. అయితే వారికి ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లు ఖాళీ చేసిన వారికి రూ.25వేల పారితోషికం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 2న రూ.25వేలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ ఆ సాయం అందించలేదు. అకస్మాత్తుగా రోడ్డున పడిన వారి బతుకులకు ఏదో ఒక రకంగా ఉపయోగపడే ఆ డబ్బులు ఇప్పటికీ అందలేదు. సాయం ఎప్పుడిస్తారు సారూ అని అధికారులను అడిగితే.. పండుగ తర్వాత ఇస్తామని చెబుతున్నారని బాధితులు అంటున్నారు. అయితే దసరా పండుగ ముందు కూడా ఇలానే అధికారులు సమాధానమిచ్చారని వాపోతున్నారు. ఇప్పుడు దీపావళి అనంతరం ఇస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు కోల్పోయి రోదనలో ఉన్న వారికి తక్షణం సాంత్వన చేకూర్చాల్సిన ప్రభుత్వం వారిని మరింత ఇబ్బంది పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నదని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. -సిటీబ్యూరో

### అంతా అయోమయం..

ప్రజాభవన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు మూసీ రిహాబిలిటేషన్ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అయితే లబ్ధిదారులను ఎంపిక చేసిన రెవెన్యూ అధికారులకు ఈ కార్యక్రమంపై సమాచారం లేకపోవడం గమనార్హం. రూ. 2 లక్షల చెక్కును మహిళా పొదుపు సంఘం నుంచి ఇప్పిస్తారని కొందరు అధికారులు చెబుతుండగా.. రూ.25వేల సాయం అయుండొచ్చని మరికొందరు అధికారులు చర్చించుకుంటున్నారు. కొసమెరుపు ఏమిటంటే చెక్కుల పంపిణీ విషయం లబ్ధిదారులకు కూడా తెలియకపోవడం విస్మయం కలిగిస్తున్నదని మరికొందరు చర్చించుకుంటున్నారు. మూసీ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం చెప్పినా.. ఇప్పటికీ ఆ సాయం ఎలా అందుతుందో కూడా లబ్ధిదారులకు సమాచారం లేదు.

### భయంలో మూసీ ప్రజలు..

మూసీ పరీవాహక ఇండ్లు కూల్చడం తప్పదనే సంకేతాలు సీఎం రేవంత్ రెడ్డి ప్రతి సమావేశంలో ప్రకటిస్తునే ఉన్నారు. దీంతో నిర్వాసితులు భయాందోళనలో ఉన్నారు. తమ ఇండ్లపై వేలాడుతున్న రెడ్ మార్క్ ఆర్‌బీ-ఎక్స్ కత్తిని చూస్తే నిద్ర కూడా పట్టడం లేదని బాధితులు చెప్తున్నారు. ఇప్పటికే కూల్చేసిన వారికి సాయం అందలేదు. ఉమ్మడి కుటుంబాలను తీసుకెళ్లి ఒకే డబుల్ బెడ్రూంలో పడేశారు. వారంతా ఎలా బతకాలో తెలియక సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ఇండ్లు కోల్పోతే తాము కూడా కష్టాలు పడాల్సిందేనా అంటూ నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.

